
# ఉన్నదీ లేనిదీ

— ఆచంట శారదాదేవి



ఎప్పుడూ ఎడ తెగకుండా పారే ఏరుకావాలన్నారు సుఖజీవనానికి. అందుకే కాబోలు తాతగారు ఈ ఊరు ఎన్నుకున్నారు. తన వానప్రస్థ జీవితానికి-ఈ ఊరి పొలి మేరల్లో గౌతమీ నది పాయ ఒకటి ఎప్పుడూఎడతెగకుండా ప్రవహిస్తూనే ఉంటుంది, వేసవి కాలంలో మాత్రం కొన్నాళ్ళు బక్కచిక్కినా! ఈ ఊరి నిండా మామిడితోటలూ, కొబ్బరితోపులూ ఉన్నాయి! పచ్చని కాంతులు ఊరంతా పరిచి ఉంటాయి. ఈ తోటల యజమానులు ఎప్పుడూ ఎక్కడ ఉంటారో తెలియదు. పట్టణాల్లో ఉంటారు కాబోలు, అప్పుడప్పుడూ వస్తూ పోతూ! అందుకే ఊళ్ళో ఎక్కువ జన సందడి ఉండదు. ప్రశాంతంగా ఉంటుంది. ఎప్పుడు చూచినా హాయిగా సేద తీర్చుకుంటున్నట్లు ఉంటుంది. ఎవరూ ఎక్కడికి ఉరకలు పరుగులు వెయ్యనక్కరలేదు. అందరూ అన్ని వేళలా తాపీగానే ఉంటారు.

తాతగారికి ఈ ఊరు నచ్చటంలో ఆశ్చర్యం లేదు. ఆయన ప్రశాంత జీవనానికి ఈ ఊరు ఏ విధంగానూ అడ్డురాదు. అన్ని విధాలా అనుకూలంగానే ఉంటుంది. అందుకే తాతగారు ఈ ఊళ్ళో ఊరి పొలి మేరల్లో ఏటికి సుదూరంగా ఒక చిన్న పాక ఏర్పరచుకున్నారు, తన శేష జీవితం సుఖంగా గడవటానికి. వెనక గదులు రెండూ డాబా గదులే అయినా ముందర వేపు వరండా రెల్లు కప్పే ఉంది. అందుకే ముందర చూడగానే అదేదో ఆశ్రమమని అనిపిస్తుంది. ఆయన జీవితం ఇక్కడ సుఖంగానే గడచి ఉండాలి. చుట్టూ కొంత కాంపౌండులా ఏర్పరచుకుని కొబ్బరి చెట్లు మామిడి చెట్లు, పనస చెట్లు అన్నీ నాటుకున్నారు. అవీ పెద్దవై నీడను తప్ప ఎండ పొడను దగ్గరికి రానీయకుండా కాపాడుతున్నాయి.

రిటైరయినా అతను ఉన్న ఊళ్ళోనే ఉండాలన్నాడు. ఆమె సరేనన్నది. ఊరు సొంత ఊరు కాదు. ఇల్లు సొంత ఇల్లు కాదు. ఎప్పుడో అద్దెకు తీసుకుని ఉంటున్నదే. అక్కడే ఉంటాననడంలో అర్థం లేదు. అయినా ఆమె కాదన లేదు. అలాగే అలవాటైన చోటే ఉందామన్నది. అతని మాటకెప్పుడూ ఎదురు చెప్పడం ఆమెకు అలవాటు లేదు. అతను అనుకున్నది జరగకపోతే ముఖం చిన్న బుచ్చుకు కూర్చుంటాడు. అందుకే ఆమె అన్నింటికి నిర్లిప్తంగా ఉండడం అలవాటు చేసుకున్నది. ఆ ఊళ్ళోనే ఉన్న స్వామిజీ ఆశ్రమానికి తరుచు వెళుతూ ఉండడం, ఆయన ఉపన్యాసాలు వింటూ ఉండడం, ఆయన రాసిన గ్రంథాలన్నీ చదవడం, మనసు నిర్మలంగా నిర్లిప్తంగా ఉండటానికి ఎంతో సహకరించాయి. అందుకే తనకు అది కావాలి ఇది కావాలి అన్న కోరికలే అసలు మనసులో మొలకలెత్తవు. ఒకవేళ ఎప్పుడైనా కలిగినా అనుకున్నది జరగకపోతే కృంగి శిథిలమయ్యేటంత బలంగా మాత్రం కాదు! చీకట్లో కృంగిపోకుండా ఏదో కొంత వెలుగు కూడా మనసు చూడకలుగుతోంది.

ఆ వేళ సంవత్సరాది, పండగ సందడిలో వరండాలో కూర్చుని అవతల వట్టి బయలు కేసిచూస్తూ ఏదో కాలక్షేపంచేస్తూ ఉంటే, "ఇదిగో ఇప్పుడే వస్తాను" అంటూ అతను లోపలికి వెళ్ళాడు. ఇదిగో వస్తాడు అదిగోవస్తాడు అని ఎదురు చూస్తూ కూర్చుంటే ఎంత సేపటికి రాలేదు. ఏమైందో అని లోపలికి వెళితే పెరట్లో గులాబీ చెట్ల దగ్గర చేతినిండా గులాబీ పూలతో క్రిందపడి ఉన్నాడు. లేవలేక బాధపడుతున్నాడు. ఆ వేళ సాయంత్రం తెలిసింది. అతని తొడ దగ్గర ఎముక విరిగిందని. అది బాగు చేయించుకోటానికి ఆరు నెలలు పట్టింది. కాలు వచ్చింది. దానితో పాటు మరొకటి కూడా వచ్చింది, చేతికి కర్ర. దానితో అతను కృంగి పోయాడు. అప్పుడు అన్నాడు ఆమెతో "ఇంక ఈ ఊరు వద్దు, ఇంకొక ఊరు పోదాం! మీ తాతగారు నీకిచ్చిన ఇల్లుంది కదా, ఆ ఊరు పోదాం. ఆ ఇంట్లో ఉందాం!" అన్నాడు. అప్పుడు అర్థమైంది. అతను వానప్రస్థానికి పరిపక్వమయ్యాడని! కాకపోతే కాస్సేపు ఆలోచించింది. తాతగారి ఊరేమిటి, ఆయన ఇల్లు ఏమటి, ఇప్పుడు ఈ ప్రయాణమేమిటి, వెళ్ళగలమా అని. మళ్ళా ఏమీ అనలేదు. అభ్యంతరం చెప్పలేదు. కాకపోతే అక్కడ ఆ ఇల్లు బాగు చేయించుకుని, ఇక్కడ ఈ ఇల్లు వదిలి వెళ్ళడానికి మరొక ఆరు నెలలు పట్టింది. తాతగారు ఇల్లు మాత్రమే కాదు, ఆయన ప్రశాంతి కూడా ఇచ్చి వెళ్ళారు. రోజులు సవ్యంగా సాగటానికి.

ఇక్కడ మధ్య ఉన్న రెండు గదుల్లో ఒకటి అతను వాడుకుంటున్నాడు. మరొకటి ఆమెకూ వచ్చే పొయ్యేవాళ్ళకు ఉపయోగపడుతోంది. వెనకవేపు వరండాకు గోడ పెట్టిస్తే అది వంట ఇల్లుగా ఉపయోగపడడం వల్ల కొంత, మళ్ళీ ఏం జరుగుతుందోనన్న భయం వల్ల కొంత, అతను ఇంట్లో కూడా ఎక్కువగా తిరగడం మానేశాడు. పొద్దున లేస్తే రాత్రి వరకు పుస్తకాలన్నీ అతని గదిలోనే ఉన్నాయి. భారతము, భాగవతము అన్నీ మళ్ళా మళ్ళా చదువుకుంటూ అందులోనే తృప్తి సంతోషం పొందకలుగుతున్నాడు. ఆమెకు ఉదయం లేస్తే సాయంత్రం వరకూ ఇంటి పనులే సరిపోతున్నాయి. క్రమక్రమంగా ఇరుగు పొరుగు పరిచయమై, ఒకరి తరువాత ఒకరు రావడము, ఏదో ఒకటి అడగడమూ, ఏదో ఒకటి చెప్పడమూ ఇదీ తీరిక లేకుండానే ఉంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇరుగు పొరుగు ఆడవాళ్ళంతా కలిసి ఇక్కడే ఈ మధ్యనే గీతా కాలక్షేపం కూడా మొదలుపెట్టారు. స్వామిజీ ఎప్పుడో చెప్పారు. "మనం తెలుసుకోటంకాదు ముఖ్యం, మనకు తెలిసినది నలుగురికైనా తెలియ చెప్పాలి. అదీ ముఖ్యం" అని. అందుకే ఆమె అందరూ కలిసి సత్కాలక్షేపం చెయ్యటం బాగానే వుంటుంది అనుకున్నది. అదీ అలా సాగుతోంది. రోజూ ఓ గంట సేపు, మిట్ట మధ్యాహ్నం ఎండ వేళ అయినా పాపం అందరూ వస్తూనే ఉన్నారు. ఏదో తెలుసుకోవాలన్న తపన. కాంక్ష అందరిలోనూ కనిపిస్తోంది.

ఆవేళ అందరూ వెళ్ళిన తరువాత కాస్త కన్ను మూద్దామని అక్కడే నడుం వాల్చేసరికి ఒంటిగంట దాటింది. అరగంట అయినా అయిందో లేదో నిద్రసరిగా పట్టనేలేదు. మగతగా మాత్రమే ఉంది. ఇంతలో ప్రక్క గదిలో ఏదో క్రిందపడినట్లు చప్పుడైంది. ఆమె లేవలేదు. మనస్సులోనే విసుక్కుంది. అతనికి పగలు నిద్ర రాదు. రోజంతా ఏదో ఒక పుస్తకం అలమారలోనుంచి బయటికి లాగుతూ మళ్ళా లోపలపెడుతూ ఉంటాడు. ఆ సందట్లో ఏదో ఒక పుస్తకమో లేదా చేతిలో ఉన్న కళ్ళజోడు పెట్టె, ఏదో ఒకటి క్రింద పడుతూ ఉంటుంది. అదీ చప్పుడూ. ఆమె లేవలేదు. బద్దకంగా ఉంటే ఇంకాస్సేపు అలాగే పడుకుంది. కాని మళ్ళా మనస్సు స్థిమితంగా లేదు. అందుకుని లేచి వెళ్ళింది. అతను మెల్లగా పడక కుర్చీలో నుంచి లేచి ప్రక్కనే ఉన్న మంచం మీదికి వెళ్ళాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ లేనిది ఇవాళ ఇదేమిటి, ఈవేళప్పుడు పడుకోవాలనుకోవడం! అతను చాలా బాధగా బెంగగా ఆమెకేసి చూశాడు. చాలా దీనంగా "కడుపు నొప్పిగా ఉంది కాస్సేపు పడుకుంటాను" అన్నాడు. ఆమెకు భయమూ దిగులూ ఇంకా కొంచం ఎక్కువ అయినాయి. మెల్లగా అతనిని లేవదీసి మంచం మీద పడుకోబెట్టింది. అతను బాధగా మళ్ళా మళ్ళా "కడుపు నొప్పిగా ఉంది" అంటూనే ఉన్నాడు. ఆమెకు ఏం చెయ్యాలో తోచలేదు. మధ్యాహ్నం చిన్న చిన్న తుంపరగా మొదలు పెట్టిన వాన ఇప్పుడు బయట కుంభవృష్టిగా కురుస్తోంది. చుట్టుపట్ల దగ్గరలో డాక్టరు ఎవరూ లేరు. ఉన్న ఒక మిషన్ హాస్పిటల్ ఊరికి అవతల మూడు మైళ్ళ దూరంలో ఉంది. ఇవాళ ఆదివారం. ఆదివారం అక్కడ ఆకు కూడా కదలదు! ఏం చెయ్యాలి! ఏమీ తోచటం లేదు! ఎవరూ దగ్గరలో తోడు కూడా లేరు. పైకి చాలా ధైర్యంగా చెప్పింది. "కాస్సేపు నెమ్మదిగా పడుకోండి. అదే తగ్గిపోతుంది. కడుపు నొప్పే గదా! అదే తగ్గిపోతుంది. ఏదో అజీర్ణం చేసి ఉంటుంది." అన్నది. నిజంగా ఆమె అంతే అనుకున్నది. మధ్యాన్నం పప్పు సరిగా ఉడకలేదని తను కూడా అనుకున్నది. అది జీర్ణం కాక కడుపు నొప్పి వచ్చి ఉంటుంది. రేపటికి తగ్గిపోతుంది. అలాగే అనుకున్నది. ఏమీ చెయ్యలేక అతను నిస్సహాయంగా పడుకున్నాడు. ఏమీ చెయ్యలేక ఆమె నిస్సహాయంగా ఊరుకుంది. అతను కాస్సేపు నిద్రపోతే మంచిది అనుకున్నది. తను అక్కడే ఉంటే అతను నిద్రపోడు. అలానే తనను చూస్తూ ఉంటాడు. ఆమె మెల్లగా లేచి అవతలకి వెళ్ళి పోయింది. మళ్ళా కాసేపయ్యాక వచ్చి చూసింది. అతను టైమెంతయింది అన్నాడు. నాలుగు కావస్తోంది అన్నది. కాస్సేపు బయటికి వెళ్ళి కూర్చుందాం అన్నాడు. ఆమె అతన్ని మెల్లగా తీసుకు వెళ్ళి వరాండాలో కూర్చోపెట్టింది. వర్షం పూర్తిగా పోలేదు. చలిగాలి వీస్తూనే ఉంది. అంతలో రామయ్య వచ్చాడు. అతను రోజూ సాయంత్రం వచ్చి అక్కడే ఉంటాడు వాళ్ళకు తోడుగా. అతను రామయ్యను పలకరించాడు. "నీ మనమరాలు వచ్చిందా" అన్నాడు. ఇంకా ఏవో కబుర్లు అడుగుతూనే ఉన్నాడు. అంతలో మళ్ళా, ఇంక లోపలికివెళతానన్నాడు. ఆమె తీసుకు వెళ్ళి పడుకోబెట్టింది. మనస్సులో ఇంకా ఆందోళనగానే ఉంది. "కడుపు నొప్పి ఎక్కువగా ఉందా? హాస్పిటల్‌కు వెళదామా?" అన్నది. అతనెప్పుడు డాక్టరు కావాలనడు, ఆమె బలవంతం చేస్తే తప్ప. ఇప్పుడూ అలాగే అన్నాడు. "అక్కరలేదు. కడుపు నొప్పి తగ్గిపోయింది" అని. ఆమె మనస్సు కాస్త కుదుట పడింది.

అర్ధరాత్రి హటాత్తుగా వాంతి అయింది. అంతలో నీరసించి దిగజారిపోయినట్లు కనిపించాడు. దగ్గరగా వచ్చిన ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. కొంచం సేపు అలాగే ఆమె చెయ్యి పట్టుకుని నిదానంగా ఆమెకేసి చూశాడు. తరువాత మెల్లగా వదిలేశాడు. ఆమె కేసి అలానే చూస్తూ ఆఖరి వీడ్కోలు చెబుతున్నట్లుగా చెయ్యి ఊపాడు. ఆమెకు అర్థమైంది. కాని అర్థం కానట్లే నిర్లిప్తంగా చూసింది. తను అధైర్యపడితే అతను ఇంకా అధైర్యపడవచ్చు. అందుకే ఏమీ జరగనట్లే ఉంది.

కాని హాస్పిటల్‌కు వెళ్ళక తప్పదు. రామయ్యను పిలిచి బండి తెమ్మన్నది. అతను తెచ్చాడు. రామయ్య బండివాడు కలిసి అతన్ని ఎలాగో బండి ఎక్కించారు. ఇంటి తలుపులు మూసి ఆమె వెళ్లింది. త్రోవలో రామయ్యను దింపింది. ఆ ఊళ్ళో వాళ్ళకు ఉన్న ఒక్క బంధువు అతని చెల్లెలు. ఆమె ఇల్లు హాస్పిటల్‌కు దగ్గరగానే ఉంది. రామయ్య అక్కడ దిగాడు కబురు చెప్పటానికి.

హాస్పిటల్ గేటు దాటే వరకు మాత్రమే అతను ఆమెకు సొంతం. ఆ తరువాత ఆమెదొక త్రోవ, అతనిదొక త్రోవ. ఆమె నర్సుతో మాట్లాడి వచ్చేలోపల అతనిని ఎక్కడికి తీసుకు వెళ్ళారో కూడా ఆమెకు తెలియలేదు. వెతుక్కుంటూ వెళ్ళవలసి వచ్చింది. ఒక గదిలో డాక్టర్లు, నర్సులూ అందరూ అతని చుట్టూ మూగి ఉన్నారు. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. ఆమె బయటనే కొంచం దూరంగా ఉండిపోయింది. కొంత సేపటికి ఒక డాక్టరు ఆమెకు దగ్గరగా వచ్చాడు. అతనికి వచ్చింది కడుపు నొప్పి కాదు "హార్ట్ ఎటాక్" ఆ ఒక్కమాటచెప్పి ఆ డాక్టరు మళ్ళా లోపలికి వెళ్ళిపోయాడు. ఆమె అలాగే నిర్లిప్తంగా ఉండిపోయింది. ఏమీ అర్థం కాని పసి పిల్లలా.

కాస్సేపటికి అతని చెల్లెలువచ్చింది. లోపలికి వెళ్ళింది. అతనిని చూసింది. డాక్టర్లతో మాట్లాడింది. మళ్ళా వచ్చింది. ఈ తరువాత ఆవిడ మళ్ళా నిర్లిప్తంగా వదినగారి పక్కనే కూర్చుంది. ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు, ఒకరి నొకరు చూసుకోటం తప్ప ఏమీ మాట్లాడుకోలేదు. మాట్లాడటానికి ఏమీ లేదు.

ఆ రోజంతా పగలు, రాత్రి ఇద్దరూ అక్కడే ఉన్నారు. అతనికి దగ్గరగా ఒక వైపు ఒకరు మరొక వైపు మరొకరు. ఇద్దరికీ ఒక్క క్షణం కూడా అతన్ని వదలి వెళ్ళాలని లేదు. ఆశా నిరాశల మధ్య ఊగుతూ కాలం గడిచింది. అతను ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు కనిపించాడు. డాక్టర్లు మత్తు మందు ఇచ్చారు. ఆ నిద్ర నిద్రగానే ఉండి పోయింది. మళ్ళా మెలకువ రాలేదు.

సాయంత్రానికి రావలసిన బంధువులందరూ వచ్చారు. జరగవలసినవన్నీ సక్రమంగానే జరిగాయి. ఆమె అన్నీ నిర్లిప్తంగా చూస్తూ కూర్చుంది.

ఏం జరుగుతోందో ఏమీ అర్థం కానట్లు. నిర్జీవమైన అతని శరీరం అంతిమ ప్రయాణానికి సిద్ధమైనప్పుడు మాత్రం బయటకు వెళ్ళి కనిపించినంత మేరకు చూస్తూ నిలుచుంది. అలానే! నిర్జీవంగా కూడా ఆ శరీరం ఇంక తనకు మళ్ళీ కనిపించదనేమో!

వచ్చిన వాళ్ళు ఒక్కరొక్కరే వెనక్కు మళ్ళారు. కొందరు ముందుగా, కొందరు వెనుకగా అందరూ వెళ్ళిపోక తప్పదు. చివరకు మిగిలింది తనూ, ఇల్లూ, అతను. అవును అతను ఆమెకింకా అక్కడే ఉన్నాడు. ఎక్కడికీ వెళ్ళిపోలేదు. ఆమెకు మామూలుగా అంతటా అతను తిరుగుతూ ఉన్నట్లే, తనతో మాట్లాడుతూ ఉన్నట్లే అనిపిస్తోంది. ప్రతి దానికి ప్రశ్నార్థకంగా మనసులోనే అతని వైపు చూస్తోంది. మనసులోనే అతని దగ్గర నుంచి సమాధానాలు దొరుకుతున్నాయి. ఎప్పుడూ తన గోడు చెప్పుకోటానికి ఎవరూ ఉండరు గనుక అన్నీ అతనికే చెబుతూ ఉండటం అలవాటైంది. పాపం, అతనూ, తనకు తోచినది తెలిసినది ఎప్పుడూ ఆమెకు చెబుతూనే ఉండేవాడు. అర్థ శతాబ్దం జీవితం అలానే గడిచింది. ఇప్పుడూ అలానే జరుగుతోంది. కాకపోతే అతనితో మాట్లాడటానికి ఎక్కడికి లేచి వెళ్ళనక్కరలేదు. తను ఉన్న చోటే అతను ఎప్పుడూ ఉంటున్నాడు. బయటకు వెళ్ళినా, ఇంట్లోనే ఉన్నా!

అతని గది అలానే ఉంది, ఎప్పుడూ ఉన్నట్లే! అతని తెల్లని బట్టలన్నీ అలానే అలమారలో వరసగా చక్కగా తీర్చిదిద్ది ఉన్నాయి. అతను రోజూ చదువుకునే పుస్తకాలన్నీ అలానే అతని బల్ల మీదనే ఉన్నాయి. చక్కగా సర్దిపెట్టి అన్నీ అతను మళ్ళా వస్తాడన్న నమ్మకంతో ఎదురు చూస్తూ ఉన్నట్లున్నాయి. ఎప్పుడో ఎలాగో మాత్రం ఎవరికీ తెలియదు.

ఆమెకు మాత్రం అతనింక మళ్ళా జీర్ణమై శిధిలమైన శరీరంతో మళ్ళా రాలేడన్న విషయం కొద్దిగా తెలుసు? ఎప్పుడైనా, ఎక్కడికి వెళతాడు వస్తాడు అన్న ఆలోచన వచ్చినా, మళ్ళా ఎలా వస్తాడు అన్న ఎదురు ప్రశ్న కూడా వస్తోంది!

కాని అసలు ముందర అతనక్కడ లేడన్న విషయమే బుర్ర కెక్కడం లేదు. అతని గదిలో అడుగు పెట్టగానే అతనక్కడ మామూలుగా ఉన్నట్లే అనిపిస్తోంది. ఆ గది, అతని వాలుకుర్చీ, పక్కనే ఉన్న పందిరి మంచం, ఎక్కడ చూచినా అక్కడ అతను మామూలుగా ఉన్నట్లే అనిపిస్తోంది. ఎప్పుడో ఒకసారి కంటిలో చూచాయగా తడి పొర కనిపించీ కనిపించకుండా వచ్చి మాయమవుతోంది. ఎప్పుడో ఒకసారి అతని పటాన్ని అదే పనిగా చూచినప్పుడు దిగులుగా, ఎక్కడికి వెళ్ళావు? మళ్ళా ఎప్పుడు వస్తావు? అని మనస్సు వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లనిపిస్తుంది. మళ్ళా కంట తడి ఉండదు. పెదవి కదలదు.

ఒక్కొక్కసారి తను మరొక వ్యక్తిగా అదృశ్యమై తనలోనే లీనమై ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఎప్పుడో అతని గదిలోకి వెళ్ళి అతని మంచం మీద పడుకున్నప్పుడు అక్కడ ఉన్నది తను కాదు అతనే అనిపిస్తుంది. వాకిట్లోకి వెళ్ళి కూర్చున్నప్పుడు అలానే అనిపిస్తుంది. అక్కడ ఉన్నది తను కాదు అతనే అని!

ఇదంతా చిత్త భ్రమ అంటారేమో! కాకపోతే వియోగం భరించలేని మనస్సు కల్పించుకున్న విన్యాసాలు! ఏదో ఒకటి!

ఎప్పుడో చాలా రోజుల క్రిందట స్వామిజీ ఒకసారి చెప్పారు: "అమ్మా! స్ఫటికంలో గురివింద ఎఱ్ఱగా మెరుస్తూ కనిపిస్తుంది. అక్కడ ఏదో ఉందను కుంటాము. నిజానికి అక్కడ ఏమీలేదు! అంతా మిథ్య. మాయ, భ్రమ. లేనిది ఉన్నదనుకుని భ్రాంతి పడుతూ ఉంటాము. అది నిజం కాదు. ప్రపంచం తీరే అంత. అమ్మా ఏదీ నిత్యము కాదు, సత్యమూకాదు. అంతా మిధ్య అంతా భ్రమ. అన్నీ నశించిపాయేవే. ఏదీ శాశ్వతం కాదు."

ఎప్పుడో చెప్పిన మాటలు. ఇదివరకు ఏది తనకు ఉన్నది అని అనుకున్నదో అదే ఏమీలేదు. అంతా మాయ, మిథ్య అన్నారు స్వామిజీ.

మరి ఇప్పుడు ఆ ఉన్నది అనుకున్నది కూడా ఇప్పుడు అసలు లేదు. నశించి మాయమైంది! అయినా తనకు ఇప్పుడది ఇది వరకు కన్నా ఇంకా బలంగా ఇంకా చాలా దృఢంగా, చాలా స్పష్టంగా చుట్టుకుని ఉన్నది. నేను పోలేదు. ఇక్కడే ఉన్నాను అంటోంది.

మరి దీనినేమనుకోవాలి! మూర్ఖత్వంలో మరింత మూర్ఖం అనుకోవాలా. అసలు ఉన్నది ఏమిటి. లేనిదీ ఏమిటి? రెండూ ఒకటేనా?

ఒక నెల రోజులు గడిచాక ఇరుగుపొరుగు స్నేహితులు మళ్లా వచ్చారు, మళ్ళా గీతా కాలక్షేపం మొదలు పెడదామని. ఆమె సరేనన్నది. జరగవలసినవన్నీ జరుగుతూనే ఉండాలి! ఏదీ ఆగకూడదు! ఆగదు!

ఆమె భగవద్గీత తెరిచి ఒక శ్లోకం చదివింది.

"గతాసూ నగతాసూంశ్చ
నాను శోచన్తిపండితాః"

శ్లోకం చదవటం పూర్తి అయింది.

ఆమె కొంచంసేపు అలానే మౌనంగా ఉండిపోయింది.

ఇన్నాళ్ళుగా చదువుతూ ఉన్న ఈ శ్లోకం అర్థం తనకు పూర్తిగా తెలియనే లేదా!

మనసు మూగగా ఉండిపోయింది. □

## మహారాష్ట్రలో మొట్టమొదటి తెలుగు మహిళా ఇంజనీరు ప్రతిమానాయుడు



"నేను సివిల్ ఇంజనీరుని కావడం కాకతాళీయం మాత్రమే." అంటారు మహారాష్ట్ర నీటి పారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పని చేస్తున్న మొదటి తెలుగు మహిళ-కుమారి ప్రతిమా నాయుడు.

కుమారి ప్రతిమా నాయుడు బి.యి. అయిన వెంటనే రాష్ట్ర నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజనీరుగా చేరి, తరువాత కూడా, మహా రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషను పరీక్షల్లో వుత్తీర్ణురాలయి అసిస్టెంటు ఇంజనీరుగా 1971లో చేరారు. ప్రభుత్వ సహాయంతోనే ఈమె బొంబాయి ఐ.ఐ.టి.లో హైడ్రాలజీలో శిక్షణ పొందారు. తర్వాత నాసిక్‌లో సెంట్రల్ డిజయిన్సు ఆర్గనైజేషను(సి.డి.ఓ)లో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా చేరారు.

ప్రస్తుతం కుమారి నాయుడు ఔరంగాబాదులో వాటర్ అండ్ ల్యాండు మేనేజిమెంటు ఇన్‌స్టిట్యూట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డిప్యుటేషను మీద వున్నారు. నాగపూరు యూనివర్శిటీ నుండి యం.ఇ. అయి పి.హెచ్.డి. కొరకు రిజిష్టరు చేసుకున్నారు.

మహిళా వుద్యోగుల గురించి ఆమె ఇలా అన్నారుః "మన వుద్యోగ విధులను సక్రమంగా నిర్వహించాలంటే, ముఖ్యంగా అది జీవిత భాగస్వామి-భర్త-మీద ఆధారపడి వుంటుంది. నాలాంటి ఇంజనీరుకు క్యాంపులకు వెళ్లడం, వంటరి ప్రయాణాలు చేయడంలాంటివి తప్పవు. ఇటు వంటి బాధ్యతలు నిర్వర్తించాలంటే చేసుకునే భర్త, నిజంగానే 'భరించేవాడు'గా వుండాలి. అందరి విషయాలలో ఇది సంభవం కాకపోవచ్చు. అందువల్ల వివాహం కొంతవరకు అడ్డు రావచ్చు అని అనుకుంటున్నాను."

రావినూతల కుసుమ కుమారి
-గడ్చిరోలి (మహారాష్ట్ర)